అక్రమ వెంచర్లపై ఆగ్రహం

- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంపై చర్చ
- బాన్సువాడ బల్దియా కౌన్సిల్ సాధారణ సమావేశంలో సభ్యుల నిలదీత


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీహరి రాజు

బాన్సువాడ: బాన్సువాడ బల్దియా పరిధిలో వెలుస్తున్న అక్రమ వెంచర్లపై అధికారుల మౌనంపై కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ వెంచర్లు, పది శాతం స్థలాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో సభ్యులు అధికారులను నిలదీశారు. బుధవారం బాన్సువాడ బల్దియాలో చైర్మన్ జంగం గంగాధర్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా బల్దియా అంశాలు, సమస్యలను సభ్యులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా కొందరు సభ్యులు లేచి బాన్సువాడలో వెలుస్తున్న అక్రమ వెంచర్లు, పది శాతం మున్సిపల్ స్థలాలపై పక్షం రోజుల క్రితం చైర్మన్, కౌన్సిలర్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పది శాతం స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో సభ్యులకు కూడా తెలియకుండా టౌన్‌ప్లానింగ్ అధికారి అంజనేయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా పరిష్కరించాలని, ఈ నెల 25న బాన్సువాడ తైబజారు వేలం నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. వార్డుల్లో విద్యుత్ స్తంభాలు అవసరమున్న చోట వేయాలని సూచించారు. మిషన్ భగీరథ నీటిని సక్రమంగా సరఫరా చేయాలని అన్నారు. సభ్యుల తెలిపిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తానని కమిషనర్ శ్రీహరి రాజు అన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి రాకుండా అడ్డుకుంటాం


బీర్కూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ : మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఏ స్వార్థంతో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నించారు. బుధవారం బాన్సువాడ కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడారు. పార్టీ మారేందుకు పోచారం హైదరాబాద్ వేదికగా బీఆర్ఎస్ కార్యకర్తలతో చర్చించినట్లు తెలిసిందని, గతంలో తాను పార్టీ మారనని చెప్పారని, దొంగలు పార్టీ మారుతారని ఎన్నో సార్లు అన్న పోచారం, ఇప్పుడు ఆ దొంగల ముఠాకు నాయకుడు అవుదామని పార్టీలోకి వస్తున్నారా అని ప్రశ్నించారు. పోచారంను కాంగ్రెస్ పార్టీలోకి రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. నాయకులు మంత్రి గణేష్, పాత బాలకృష్ణ, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, ఉద్దెర హన్మాండ్లు, మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, భూనేకర్ ప్రకాష్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి రానివ్వం

నస్రుల్లాబాద్: ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వలస జీవి అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందు రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కార్యకర్తల అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోచారం ఎక్కడ నీరు ఉంటే అక్కడ వాలి జీవిస్తారన్నారు. అందుకే మొదట రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీతో ప్రారంభించి, టీడీపీ, బీఆర్ఎస్ తర్వాత మళ్లీ అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉండటంతో రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఆయన రాకను నస్రుల్లాబాద్ మండల కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అడ్డుకుంటారన్నారు. ఇందు కోసం సీఎం రేవంత్ రెడ్డిని కలవడానికి రాజధానికి వెళతామన్నారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్, మండల పార్టీ కార్యదర్శి శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయాన్ని గౌరవించాలి

బాన్సువాడ రూరల్: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పార్టీలోకి తీసుకుంటే ఆ నిర్ణయాన్ని ప్రతి కార్యకర్త గౌరవించి, స్వాగతించాలని జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ దేవికృష్ణ ప్రసాద్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి ఏనాడు పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి రానివ్వమని చెప్పలేదని, ఈ విషయాన్ని కింది స్థాయి నాయకులు గమనించాలన్నారు.

క్లుప్తంగా

అర్హులందరికి 'పీఎం కిసాన్' అందించాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): అర్హులైన రైతులందరికి పీఎం కిసాన్ పథకం ద్వారా డబ్బులు అందించాలని ఎంపీపీ మాధవి అన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి సంబందించి కటాఫ్ తేది ఫిబ్రవరి 1, 2019గా నిర్ణయించిందని, కటాఫ్ తేదీని పొడిగించి మిగతా రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

స.హ. చట్టం ద్వారా అన్ని వివరాలు పొందవచ్చు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): స.హ. చట్టం ద్వారా కావాల్సిన సమాచారాన్ని పొందవచ్చని స.హ. చట్టం రాష్ట్ర డైరెక్టర్ సలీం అన్నారు. బుధవారం పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు స.హ చట్టం గురించి అవగాహన కల్పించారు. స.హ చట్టం ద్వారా ప్రతి ఒక్కరు సమాచారాన్ని పొందే హక్కును ప్రభుత్వం కల్పించిందన్నారు. నాయకులు ఇంతియాజ్, లింగమయ్య, రాజు, పాఠశాల ప్రిన్సిపల్ మౌనిక తదితరులున్నారు.

తెలంగాణ పీజీ కామన్ టెస్టులో ప్రతిభ


ఉమేష్‌చంద్ర యాదవ్


వివేకానంద

లింగంపేట(ఎల్లారెడ్డి): తెలంగాణ పీజీ కామన్ ఎంట్రెస్ట్ టెస్టు(ఎమ్‌టెక్) ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయి 95వ ర్యాంకు సాధించిన మెంగారం గ్రామానికి చెందిన ఉమేష్‌చంద్ర యాదవ్, 220 ర్యాంకు సాధించిన పొల్కంపేటకు చెందిన చామారం వివేకానందలను ఆయా గ్రామాల పెద్దలు అభినందించారు. ఉమేష్‌చంద్ర ఘట్‌కేసర్‌లోని ఏసీఈ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్(ఈఈఈ) పూర్తి చేశాడు. అలాగే చామారం వివేకానంద ఇబ్రహీంపటన్‌లోని సైంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్(సీఈసీ) పూర్తి చేశాడు. విద్యార్థులను గ్రామస్తులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఆలయానికి విరాళం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం దేవునిపల్లి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి హైదరాబాద్ కిమ్స్ వైద్యుడు కాశ శ్రీనివాస్ బుధవారం రూ.50,116లు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సంగయ్య, రమేష్, భూలక్ష్మణ్, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల నెరవేరింది

కామారెడ్డి అర్బన్: దశాబ్దాల కాలంగా న్యాయ పోరాటం చేసిన భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు ఎట్టకేలకు ప్రమోషన్లు అందాయని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్, పేటా నాయకులు అరుణ్ కుమార్, అబ్దుల్ రజాక్, గఫూర్ శిక్షక్, రంగా వెంకటేశ్వర్‌గౌడ్, ఎస్.మధుసూదన్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చూపిన చొరవతోనే ప్రమోషన్లు వచ్చాయని వారు పేర్కొన్నారు. జిల్లాలో 198 తెలుగు, 174 హిందీ, 75 వ్యాయామ ఉపాధ్యాయులు ప్రమోషన్లు పొందినట్లు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్, పేటా నాయకులు వివరించారు.

వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ పదవ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సీబీసీ 'నా కోసం... సమాజం కోసం యోగా' అనే అంశంపై స్థానిక ఫ్రోబెల్స్ స్కూల్ విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలకు 21 శుక్రవారం ఉదయం 6 గంటలకు జిల్లా యోగా భవన్‌లో నిర్వహించే ఇంటర్నేషనల్ యోగా డే కార్యక్రమంలో జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని సీబీసీ క్షేత్ర పచార అధికారి బి.ధర్మనాయక్ తెలిపారు. యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, సీబీసీ అధికారులు రషీద్, పోచయ్య, ఫ్రోబెల్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ అర్జున్ పాల్గొన్నారు.

వైద్యులపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహించకుండా ప్రైవేట్ ఆస్పత్రుల్లో పని చేస్తున్న ప్రభుత్వ వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా సోషలిస్ట్ సమాజ్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు బుధవారం డీసీహెచ్ఎస్‌కు వినతిపత్రం అందజేశారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రత్యేక అధికారుల పాలనపై ప్రజల్లో అసంతృప్తి

రాజంపేట: మండల కేంద్రంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ లింగాల స్వరూప అధ్యక్షతన కొనసాగింది. ఆరుగొండ గ్రామంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించడం లేదని ఎంపీటీసీ సాగర్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక అధికారుల పాలన పట్ల ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని పొందుర్తి ఎంపీటీసీ బాలరాజు గౌడ్ సభాదృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని ఆయన కోరారు.

తలమడ్ల గ్రామ పరిధిలో ఓ పౌల్ట్రీ ఫారం కారణంగా తలమడ్ల, పొందుర్తి, శివాయిపల్లి, ఆరేపల్లి గ్రామాలలో ఈగల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సంబంధిత అధికారులు ఈ సమస్య పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తలమడ్ల ఎంపీటీసీ నర్మల రాజు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దుబ్బని సావిత్రి, జెడ్పీటీసీ కొండ హన్మాండ్లు, ఎంపీడీవో రాజేశం, తహసీల్దార్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న కార్మిక నేతలు

కామారెడ్డి టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు, డిమాండ్‌లను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ సుజాతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సు మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు అమలు చేయాలన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం దశలవారీగా పోరాటాలు చేస్తామన్నారు. ఈనెల 26న కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహబూబ్ అలీ, నాయకులు దీపక్, ప్రభు, విజయ్, దీవేన, జ్యోతి, భూలక్ష్మి ఉన్నారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం


శివాజీ విగ్రహం వద్ద వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ప్రతినిధులు


ఎల్లారెడ్డిలో ..

కామారెడ్డి అర్బన్: హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా బుధవారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో స్థానిక సరస్వతి విద్యామందిర్ సమీపంలోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షుడు వడ్ల వెంకటస్వామి మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని కాపాడానికి ఛత్రపతి మొఘలులపై వీరోచిత పోరాటాలు చేశారని గుర్తు చేశారు. వీహెచ్‌పీ నగర కార్యదర్శి వంగ ప్రసాద్, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ మంచాల రాజు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో బజరంగ్ దల్ నాయకులు బుధవారం శివాజీ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. శివాజీకి పట్టాభిషేకం చేసిన రోజును పురస్కరించుకుని శివాజీ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. బజరంగ్ దళ్ నాయకులు వినోద్, నవీన్ తదితరులున్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్ గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బోర్లం, ఇబ్రహీంపేట్, పోచారం, రాంపూర్, జక్కల్‌దాని తండా, బోర్లం క్యాంపు తండాల్లో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. కొల్లూర్ గ్రామంలోని 132కేవీ సబ్‌స్టేషన్‌తో పాటు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు ఉండటం వల్ల సరఫరా నిలిపేస్తున్నామని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే సమీక్షా సమావేశం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జిల్లా స్థాయి అధికారులతో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు బుధవారం తెలిపారు. ఈ నెల 20, 21వ తేదీలలో సమీక్ష నిర్వహించనున్నట్లు వారు చెప్పారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు గురువారం పంపిణీ చేయనున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు హిమబిందు తెలిపారు. సంవత్సరం పిల్లల నుంచి 19 ఏళ్ల వయస్సు గల యువకులకు మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

స్టాఫ్ నర్సు ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్: బోర్లం రోడ్డులో ఉన్న తెలంగాణ మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేయటానికి స్టాఫ్ నర్సు పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ధనలక్ష్మి తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ లేదా జనరల్ నర్సింగ్ కోర్సు చేసిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఈ నెల 20లోపు బోర్లం రోడ్డులో ఉన్న మైనార్టీ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

21న శ్రీనవదుర్గ సామూహిక వ్రతం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి తూర్పు హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీశారదా మాత ఆలయంలో ఈనెల 21న శుక్రవారం ఉదయం 11 గంటలకు పౌర్ణమి సందర్భంగా సామూహిక శ్రీనవ దుర్గ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కే.మహిపాల్‌రెడ్డి తెలిపారు. నవదుర్గ వ్రతానికి అవసరమైన పూజసామాగ్రిని ఆలయ కమిటీ తరపున అందిస్తామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీలను ప్రీస్కూల్స్‌గా మార్చాలి



మద్నూర్(జుక్కల్): అంగన్‌వాడీ కేంద్రాలను ఇక నుంచి ప్రీ స్కూల్స్‌గా మార్చాలని ఐసీడీఎస్ సీడీపీవో సునంద పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కార్యాలయంలో బుధవారం ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీని ప్రీస్కూల్స్‌గా ఏర్పాటు చేయనుందని జిల్లాలో మద్నూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఎంపికైందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు బ్యాచ్‌లవారీగా శిక్షణ మొదలు పెట్టామన్నారు.

రోడ్డుపై గుంతలను పూడ్చారు



సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో ప్రధాన రోడ్డు మీద ఉన్న గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయని, ఈ నెల 17న సాక్షిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. బుధవారం కొత్త బస్టాండ్ నుంచి కామారెడ్డి ఫంక్షన్ హాల్ వరకు ఉన్న గుంతలను సిమెంట్ వేసి పూడ్చేశారు. అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించడంతో స్థానిక కాలనీవాసులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

ఐఐఎంలో సీటు సాధించిన గిరిజన విద్యార్థిని



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మెల్లకుంటతండాకు చెందిన రమావత్ విఠల్, శాంతి దంపతుల కుమార్తె వీణ ఒరిస్సాలోని సంబల్పూర్‌లో గల ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) కళాశాలలో సీటు సాధించింది. హైద్రాబాద్‌లోని ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన వీణ క్యాట్ పరీక్ష రాసి ఉత్తమర్యాంకు సాధించింది. దీంతో దేశంలోని ప్రముఖ కళాశాలల్లో ఒకటైన సంబల్పూర్‌లోని ఐఐఎం కళాశాలలో ఎంబీఏ కోర్సు చదివేందుకు వీణకు అవకాశం దక్కింది. దేశంలోనే ప్రముఖ కళాశాలగా పేరొందిన ఐఐఎం కళాశాలలో సీటు సాధించిన వీణను తండావాసులు అభినందిస్తున్నారు. కాగా ఎంబీఏ పూర్తిచేసేందుకు సుమారు రూ.25లక్షల వరకు ఖర్చు వుతుందని వీణ కుటుంబసభ్యులు తెలిపారు. ప్రస్తుతం వీణ తల్లిదండ్రులు బతుకుదెరువు నిమిత్తం హైద్రాబాద్ వలసవెళ్లి అక్కడే కూలిపనులు చేసుకుంటున్నారు. తమ కూతురు చదువు నిమిత్తం ఎవరైనా ఆర్థిక సహాయం అందించాలని వీణ తల్లిదండ్రులు కోరుతున్నారు.

'ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు'



నస్రుల్లాబాద్(బాన్సువాడ): గ్రామ పంచాయతీలలో నిధులు లేక సిబ్బంది వేతనాలు, విద్యుత్ చార్జీలు, పారిశుద్యం, తాగునీటి సరఫరా మొదలగు పనుల నిర్వహణ భారంగా మారిందని పంచాయతీ కార్యదర్శులు వాపోయారు. ఈ సమస్యపై మండలంలోని పంచాయతి కార్యదర్శులు బుధవారం ఎంపీడీవో నీలావతి, ఎంపీవో రాముకు వినతి పత్రం అందించారు. ఐదు నెలలుగా గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని, ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు విఠల్, రజిత, మానస, నవీన్, ముఖీద్, ఫయాస్, శశిధర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారం గ్రామంలో కొచ్చెరి మైసమ్మ ఆలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..భక్తుల తాకిడి దిన దినం పెరగడంతో రూ.1.60 కోట్లతో నూతనంగా వసతి గృహం, రూ.40 లక్షలతో సీసీ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేశామన్నారు. ఆయన వెంట ఎంపీపీ పాల్త్య విఠల్, జెడ్పీ కో-ఆప్షన్ మాజిద్ ఖాన్, నాయకులు ప్రతాప్ సింగ్, రాము, పవన్, సాయిలు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్..


వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

బిచ్కుంద(జుక్కల్): సాక్షి దినపత్రికలో బుధవారం 'రోడ్డా..మురికి కూపమా..?' అంటూ వచ్చిన వార్త కథనానికి అధికారులు స్పందించారు. బాన్సువాడ డీఎల్‌పీవో నాగరాజు, ప్రత్యేక అధికారి తహసీల్దార్ సురేష్, ఎంపీవో మహబూబ్ 14, 15 వార్డులలో సందర్శించి రోడ్డుపై ఉన్న మురికి నీరు, మురికి కాలువలు పరిశీలించి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రోడ్డుపై ఉన్న మురికిని చూసి అధికారులు పంచాయతి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు అక్కడే ఉండి మురికిని తొలగించి బ్లీచింగ్ చల్లి వీధులను శుభ్రం చేయించారు. పారిశుద్యం లోపించినట్లు మా దృష్టికి వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని సూచించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


మాట్లాడుతున్న ఐకేపీ డీపీఎం సుధాకర్

కామారెడ్డి రూరల్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐకేపీ డీపీఎం సుధాకర్ సూచించారు. బుధవారం కామారెడ్డి మండల సమాఖ్య కార్యాలయంలో లక్ష్మీనరసింహ జిల్లా మహిళా సమాఖ్య 69వ సమావేశం రాజమణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆర్థికంగా ఎదగడానికి ఆదాయం వచ్చే కార్యక్రమాలు నిర్వహించాలని సభ్యులకు సూచించారు. సంఘాల పుస్తక నిర్వహణ ఎప్పటికప్పుడు ఆన్లైన్‌లో నమోదు చేయాలన్నారు. లోకోస్ యాప్‌లో నమోదు చేయడం గురించి చర్చించారు. ఫుడ్ ఎంటర్‌ప్రైజెస్ పీఎంఎఫ్ఎంఈ రుణాల గురించి రైతు సేవా కేంద్రాల గురించి డీపీఎం వకుల వివరించారు. సమావేశంలో 22 మండల సమాఖ్యల అధ్యక్షురాళ్లు, డీపీఎంలు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు


జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు నాయకులు, కార్యకర్తలు కేకులు కట్ చేశారు. అనంతరం ఒకరికొకరు కేకును తినిపించుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ఈ సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

సంక్షిప్తం

ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో బుధవారం గ్రూప్ ఆఫ్ హెల్పింగ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు యువతను అభినందించారు. మెడికవర్ ఆస్పత్రి నిజామాబాద్ సహకారంతో 400 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందు పటేల్, దుర్కి సొసైటీ చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్, గ్రూప్ ఆఫ్ హెల్పింగ్ ఫ్రెండ్ అధ్యక్షుడు సురేష్‌కుమార్, వ్యవస్థాపకులు నరేష్ రాథోడ్, సునీల్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రవీణ్‌కుమార్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రవీణ్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన షరీఫ్ కామారెడ్డి కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు.

తాడ్వాయి పాఠశాలలో యోగా

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ప్రతినిధులు రాములు, విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతోపాటు ప్రతి రోజు యోగా చేసినట్లయితే ఆరోగ్యంగా ఉంటారన్నారు.

పుస్తకాల పంపిణీ

రామారెడ్డి: ఇసన్నపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అందించిన ఉచిత పాఠ్యపుస్తకాలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ సుమలత బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బాలకిషన్, ఉపాధ్యాయులు తిరుపతి నాయుడు, విజయ, లింగపురం శంకర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు నోట్ పుస్తకాలు..

దోమకొండ: జిల్లా నూతన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను బుధవారం దోమకొండ జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి నోట్ పుస్తకాలను అందజేశారు. ఆయన వెంట సింగిల్ విండో డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

జీపీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష

నస్రుల్లాబాద్(బాన్సువాడ): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతి కార్యదర్శులు మరియు ఈజీఎస్ సిబ్బందితో ఎంపీడీవో నీలావతి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నమెంట్ పారామీటర్స్, ఫార్మ్ పాండ్స్, హార్టికల్చర్ ప్లాంటేషన్, వివిధ పనుల గురించి నివేదికలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో రాము, ఏపీవో సౌజన్య, కార్యదర్శులు రజిత, నవీన్, ముఖీద్, ఫయాస్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

యజమానులు స్పందించాలి

కామారెడ్డి టౌన్: పట్టణంలోని ప్రధాన రోడ్లపై పశువులు సంచరించడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే పశువుల యజమానులు వాటిని స్వాధీనం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సుజాత బుధవారం హెచ్చరించారు. వాటిని రోడ్లపై సంచరించకుండా పాకల్లో కట్టివేయాలని ఆదేశించారు. లేని పక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పశువుల వల్ల పారిశుద్య పనులకు ఆటంకం కలగడంతో పాటు ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు.